పడకేసిన పారిశుధ్యం

- మ్యాన్‌హోళ్ల ద్వారా రోడ్లపైకి మురుగు
- డంపింగ్ యార్డులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు



ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 54వ డివిజన్లో గల జనార్దన్‌రెడ్డి కాలనీలో పారిశుధ్యం దయనీయంగా మారింది. పలు ప్రాంతాల్లో మురుగు పేరుకుపోయి మ్యాన్‌హోళ్ల ద్వారా రోడ్లపైకొస్తోంది. దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికుల పాట్లు వర్ణనాతీతమవుతున్నాయి. జనార్దన్‌రెడ్డికాలనీలోని పుచ్చలపల్లి సుందరయ్య వీధిలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇక్కడ ఉన్న నాలుగు మ్యాన్‌హోళ్లు మురుగుతో నిండిపోయాయి. రోడ్లపై మురుగు ప్రవహిస్తుండటంతో దోమల సమస్య తీవ్రమవుతోంది. ఎన్నో రోజులుగా సమస్య నెలకొన్నా, పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వీధి కుళాయి పాచి పట్టిపోయి కలుషిత వాతావరణంలో దర్శనమిస్తోంది. ఇక్కడి ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ ఆదేశించినా, ఇక్కడ సమస్య అలాగే ఉంది. పిచ్చి చెట్లు, ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో విషసర్పాలు సంచరించే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



మ్యాన్‌హోల్ నుంచి బయటకొస్తున్న మురుగు

దుర్గంధంతో ఇబ్బందిగా ఉంది



మా ఇంటి ముందున్న రోడ్డులో నాలుగు మ్యాన్‌హోళ్లు ఉన్నాయి. వీటి ద్వారా రోడ్డుపై మురుగు ప్రవహిస్తోంది. ఫలితంగా నానా ఇబ్బంది పడుతున్నాం. శుభ్రం చేయాలని నగరపాలక సంస్థ సిబ్బందిని కోరగా, సచివాలయాల్లో అర్జీలు పెట్టుకోవాలంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.

– సుబ్బారావు, జనార్దన్‌రెడ్డికాలనీ

ఎప్పుడో శుభ్రం చేస్తున్నారు



మ్యాన్‌హోళ్లను విస్మరించి గతంలో రోడ్లు వేశారు. ఎన్నో ఏళ్లుగా వీటిని శుభ్రం చేయలేదు. దీంతో రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది. రాకపోకలు సాగించాలంటే అసౌకర్యంగా ఉంటోంది. సమస్యను పరిష్కరించాలి.

– మస్తానమ్మ, పుచ్చలపల్లి సుందరయ్య వీధి

క్లుప్తంగా

కార్యాలయ ఏర్పాటుకు భూ పరిశీలన



నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ ఆవరణలో డీఎల్పీఓ కార్యాలయ ఏర్పాటుకు సంబంధించిన భూమిని అధికారులు గురువారం పరిశీలించారు. జెడ్పీ సీఈఓ విద్యారమ తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానంలో బహిరంగ వేలం



నెల్లూరు(బృందావనం): నగరంలోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో బహిరంగ వేలం పాటలు, సీల్డ్ టెండర్లను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ విరుపావరుల గిరికృష్ణ మాట్లాడారు. హక్కులను పలువురు దక్కించుకున్నారని చెప్పారు. దీని ద్వారా దేవస్థానానికి రూ.15.82 లక్షలు సమకూరాయన్నారు. అల్లూరు, కోవూరు గ్రూప్ దేవస్థానాల ఈఓలు చిట్టిబాబు, కృష్ణప్రసాద్, దేవదాయ శాఖ నెల్లూరు ఇన్‌స్పెక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

అన్నదాతకు గిట్టుబాటు ధర కల్పించాలని వినతి



జేసీతో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(అర్బన్): వరికి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర అన్నదాతకు లభించేలా చర్యలు చేపట్టాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ మేరకు నియోజకవర్గ రైతు నేతలతో కలిసి కలెక్టరేట్లో జేసీ కార్తీక్‌తో గురువారం ఆమె భేటీ అయ్యారు. కాగా ఇబ్బందుల్లేకుండా కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, నేతలు మాతూరు శ్రీనివాసులురెడ్డి, అత్తిపల్లి శివారెడ్డి, ఆదాల శివారెడ్డి, నెల్లూరు రమణారెడ్డి, ఎం రమణారెడ్డి, హరికృష్ణ, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుక



నెల్లూరు(బృందావనం): నర్తకి సెంటర్‌లోని గానం అకాడమీలో తెలుగు సినిమా పుట్టిన రోజు వేడుకలను గురువారం నిర్వహించారు. తొలుత కేక్‌ను కట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, నెల్లూరు డివిజన్ కోఆర్డినేటర్ కళాంజలి అనంత్, నిర్మాతలు శైలజ, మల్లికార్జున, 24 క్రాఫ్ట్‌కు చెందిన దువ్వూరు బెనర్జీ, నెల్లూరు రాజా, శిరీష, ఆంజనేయులు, మునిచంద్ర, శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల పునఃప్రతిష్ట



నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో నాగరాజ, నాగలక్ష్మి దేవతల విగ్రహాల పునఃప్రతిష్ట, అభిషేకాలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య, జగన్నాథం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నడక, నవ్వుతో మంచి ఆరోగ్యం



నెల్లూరు(అర్బన్): నడకతో పాటు మనస్ఫూర్తిగా నవ్వడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని వీఆర్సీ వాకర్స్ లాఫింగ్ క్లబ్ సెక్రటరీ, ఉద్యోగ సంఘాల రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు బండారు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. వీఆర్సీ క్రీడా ప్రాంగణానికి వచ్చే వాకర్స్ కోసం క్లబ్ సభ్యులు కళాధర్‌రావు, వెంకటహరిప్రసాద్, నాగేశ్వరరావు సాయంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను వారు గురువారం ప్రారంభించారు. న్యాయవాది నన్నేసాహెబ్, క్లబ్ డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, శివబాలయోగి, సుబ్బారావు, యస్దానీ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఆదాల పరామర్శ



నెల్లూరు(బారకాసు): అల్లూరు మండలంలోని నార్తుమోపూరుకు చెందిన కొండా శ్రీనివాసులురెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. శ్రీనివాసులురెడ్డి సతీమణి అరుణమ్మ ఇటీవల మృతి చెందడంతో వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తొలుత ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రైల్వేబోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, హరిబాబుయాదవ్, జెడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, పార్టీ మహిళా నేత కల్లూరు లక్ష్మీరెడ్డి, స్వర్ణా జీవన్‌ప్రసాద్, నేతలు కొండేటి నరసింహారావు, మైపాడు అల్లాబక్షు, మొయిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

- బీవీనగర్ నివాసి అంకినపల్లి ఓబుల్‌రెడ్డి కుటుంబసభ్యులను ఆదాల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. ఓబుల్‌రెడ్డి సతీమణి కౌసల్యమ్మ ఇటీవల మృతి చెందడంతో వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
- వెంకటేశ్వరపురానికి చెందిన జానీబాషా తల్లి మాజీబీ, భార్య ముంతాజ్‌బేగం ఇటీవల మరణించడంతో ఆయన్ను ఆదాల ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): నగరంలో జరిగిన వేర్వేరు ఘటనల్లో మూడు కుటుంబాలకు చెందిన ఆరుగురు అదృశ్యమయ్యారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

- తల్లి తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. లస్సీ సెంటర్ సమీపంలో నివాసం ఉంటున్న కృష్ణవేణికి ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె సంకీర్తనకు బాలాజీనగర్‌కు చెందిన నాగార్జునతో వివాహం చేశారు. వీరికి ఎనిమిదో తరగతి చదివే కుమారుడు, ఐదో తరగతి చదివే కుమార్తె ఉన్నారు. దంపతుల నడుమ ఐదు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. మహిళా పోలీస్‌స్టేషన్లో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో సంకీర్తన తన పిల్లలతో కలిసి తల్లి వద్దకు మూడు రోజుల క్రితం వచ్చారు. ఈ తరుణంలో పని నిమిత్తం కృష్ణవేణి బయటకెళ్లగా, సంకీర్తన తన పిల్లలను తీసుకొని ఎటో వెళ్లిపోయారు. అనంతరం వచ్చిన కృష్ణవేణికి వీరు కనిపించకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆమె ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.
- కొడుకును తీసుకొని తండ్రి అదృశ్యమైన ఘటనపై చిన్నబజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని రావిచెట్టు సెంటర్‌కు చెందిన సుప్రజకు గాంధీనగర్‌కు చెందిన అశోక్‌రత్నవర్మతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వేదాయపాళెం సెంటర్లో మొబైల్ షాపును ఆయన నిర్వహిస్తున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. ప్రస్తుతం తల్లిదండ్రుల వద్ద ఆమె ఉంటున్నారు. ఈ క్రమంలో భార్య వద్దకు అశోక్ వెళ్లారు. అనంతరం ఆమె వద్ద ఉన్న కుమారుడ్ని తీసుకొని ఎటో వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.
- ఇంటి నుంచి బయటకెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యారు. పోలీసుల సమాచారం మేరకు.. జనార్దన్‌రెడ్డికాలనీ లక్ష్మీపురానికి చెందిన శీనయ్య కూలీ పనులు చేసుకుంటూ తల్లి వద్ద ఉంటున్నారు. ఈ నెల రెండో తేదీన ఇంటి నుంచి బయటకెళ్లిన ఆయన అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలను కుటుంబసభ్యులు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా మనస్పర్థలతో శీనయ్యను భార్య వదిలి వెళ్లారని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురం భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న శ్రీనివాసులు(45), సునీత దంపతులకు కుమారుడున్నారు. నిత్యం మద్యం మత్తులో ఆయన ఉండేవారు. మద్యం మానేయాలని పలుమార్లు ఆమె కోరినా ప్రయోజనం లభించలేదు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతునా, ఈ అలవాటును ఆయన మానలేదు. దంపతుల నడుమ ఈ నెల రెండున గొడవ జరిగింది. దీంతో మరుసటి రోజు తన కుమారుడ్ని తీసుకొని బుచ్చిరెడ్డిపాళెంలోని పుట్టింటికెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శ్రీనివాసులు పూటుగా మద్యం సేవిస్తూ అక్కడే ఉండిపోయారు. ఇంటి నుంచి తీవ్ర దుర్గంధం వస్తుండటంతో సునీత, నవాబుపేట పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. తన కుమారుడితో కలిసి హుటాహుటిన ఇంటికి ఆమె చేరుకున్నారు. తలుపులు పగలగొట్టి చూడగా, శ్రీనివాసులు మృతి చెంది ఉన్నారు. దీనిపై నవాబుపేట పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): వివాహితను వేధింపులకు గురిచేసిన భర్త, అత్తింటివారిపై కేసును సంతపేట పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కపాడిపాళేనికి చెందిన నాగదేవి, వంశీ దంపతులకు ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా వివాహేతర సంబంధాలను కొనసాగిస్తూ భార్యను మానసికంగా, శారీరకంగా వేధించసాగారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ ఇబ్బందులు పెట్టసాగారు. విషయాన్ని అత్తింటివారికి చెప్పినా, వంశీనే వారు సమర్థించారు. విడాకులివ్వాలని, లేని పక్షంలో చంపుతామని అందరూ కలిసి బెదిరించసాగారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏఎస్సై శంకరయ్య దర్యాప్తు చేస్తున్నారు.

డెంగీ ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): మలేరియా, డెంగీ, చికున్‌గున్యా లాంటి వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. సంతపేటలోని వైద్యశాఖ కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై గురువారం నిర్వహించిన నెలవారీ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కాలువలు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే ఆయిల్ బాల్స్‌ను వేయాలని సూచించారు. దోమల లార్వాలు మరణించేందుకు మందును స్ప్రే చేయాలని కోరారు. ఫైలేరియా కేసులను ఆన్‌లైన్లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని తెలిపారు. మలేరియా సహాయ నివారణాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): సూర్యఘర్ బిజిలీ యోజనపై సరస్వతీనగర్ సబ్‌స్టేషన్లో అవగాహన కార్యక్రమాన్ని ఏఈఈ లక్ష్మీబాయ్ గురువారం నిర్వహించారు. సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పది మంది చేయించుకున్నారు. రాజేంద్రనగర్ సబ్ డివిజన్ డీఈఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

9న మంత్రుల పర్యటన

నెల్లూరు రూరల్: ఆత్మకూరులో మంత్రులు ఈ నెల తొమ్మిదిన పర్యటించనున్నారని జిల్లా సమాచార, పౌరసంబంధాల అధికారి సదారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల ప్రారంభానికి గానూ మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఫరూక్, జనార్దన్‌రెడ్డి, సవిత, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయనున్నారని వివరించారు.

పండ్ల పంపిణీ

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని ప్రభుత్వ విభిన్న ప్రతిభావంతుల బాలికల వసతిగృహంలో పండ్లు, బిస్కెట్లను జెడ్పీ వాకర్స్ సంఘ గౌరవాధ్యక్షుడు మెట్టు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. తన తల్లి సరస్వతమ్మ వర్ధంతిని పురస్కరించుకొని వీటిని అందజేశామని ఆయన చెప్పారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి సభ్యులు ఖాజామస్తాన్, చెంచయ్య, రాజగోపాల్, కోటేశ్వరరావు, మురుగన్, వెంకటేశ్వర్లురెడ్డి, అంకయ్య, వీరగంధం తదితరులు పాల్గొన్నారు.

యాంట్రప్రెనార్‌షిప్‌పై అవగాహన

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు యాంట్రప్రెనార్‌షిప్‌పై గురువారం అవగాహన కల్పించారు. డబ్ల్యూపీపీఐటీ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ పవన్‌మహేష్, ఈడీ సెల్ కన్వీనర్ సాయికుమార్, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, వివిధ విభాగాధిపతులు మురళి, రాజేంద్ర, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికావు

నెల్లూరు(బారకాసు): రెడ్లపై జనసేన నేత నాగబాబు తప్పుగా మాట్లాడటం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 36వ డివిజన్ ఇన్‌చార్జి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో హితవు పలికారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, దివంగత వైఎస్సార్‌పై మాట్లాడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. క్షమాపణ చెప్పకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

ఉప సర్పంచ్‌కు బాధ్యతలు

నెల్లూరు (పొగతోట): తోటపల్లిగూడూరు మండలం చింతోపు సర్పంచ్ మల్లికార్జున రెండు నెలలుగా అందుబాటులో లేరు. దీంతో ఉప సర్పంచ్ సుధాకర్‌కు సర్పంచ్‌గా బాధ్యతలను అప్పగిస్తూ డీపీఓ శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. సర్పంచ్ అందుబాటులో లేకపోవడంతో గ్రామంలో వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నామంటూ ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా, ఇదే విషయాన్ని నిర్ధారించారు. దీంతో ఉప సర్పంచ్‌కు సర్పంచ్ బాధ్యతలను అప్పగించారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

నెల్లూరు రూరల్: నియోజకవర్గ స్థాయిలో విజన్ ప్రణాళికను రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. పీ – 4 విధానం, పేదరిక నిర్మూలనపై సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ గురువారం నిర్వహించారు. నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఆనంద్ వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ఉగాది నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న పీ – 4 విధానానికి సంబంధించి నియోజకవర్గ స్థాయిలో విజన్ ప్రణాళికను రూపొందించేందుకు టీములను ఏర్పాటు చేయాలని కోరారు.

బెదిరింపులతో విజయం.. గెలుపే కాదు



మాట్లాడుతున్న శ్రీనివాసయాదవ్

నెల్లూరు(బారకాసు): డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కార్పొరేటర్లను బెదిరించి, ప్రలోభాలకు గురిచేసి గెలుపొందారని, అసలు ఇది విజయమేనానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ ప్రశ్నించారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో పలువురు కార్పొరేటర్లు, నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. డిప్యూటీ మేయర్ ఎన్నిక సమయంలో విప్‌ను జారీ చేశామని, దీన్ని ధిక్కరించి ఓటేసిన వారిపై అనర్హత వేటు తప్పదని చెప్పారు. బీ – ఫారం ఇచ్చే సాహసాన్ని సైతం టీడీపీ చేయలేకపోయిందని, ఇండిపెండెంట్ అభ్యర్థిని డిప్యూటి మేయర్‌గా ప్రకటించడం కంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందానని ప్రశ్నించారు. విలువల్లేకుండా వ్యవహరించిన రూప్‌కుమార్‌యాదవ్, ఇప్పుడు వాటి గురించి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తనపై ఆయన దురుసుగా ప్రవర్తించారని, ఇలాంటి వాటికి భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రేమాభిమానంతో పలువురు కార్పొరేటర్లు పార్టీలో ఉన్నారని, వీరెవరూ పార్టీ మారే ప్రసక్తేలేదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కాకాణి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. కార్పొరేటర్ సత్తార్, మాజీ కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నేతలు జకీర్, శ్యామ్‌సింగ్, ముజఫర్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ నేడు



మాట్లాడుతున్న ఉమామహేశ్వర్

నెల్లూరు (లీగల్): కర్నూల్లో ఏర్పాటు చేయనున్న హైకోర్టు బెంచ్‌లో జిల్లాను కలపాలనే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టు విధులను న్యాయవాదులు శుక్రవారం బహిష్కరించనున్నారని బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్‌రెడ్డి, సుందరయ్యయాదవ్ పేర్కొన్నారు. కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. అమరావతిలోని హైకోర్టు పరిధిలోనె జిల్లా న్యాయ వ్యవస్థను ఉంచాలని, కర్నూల్లో ఏర్పాటు చేయనున్న బెంచ్‌లో కలపొద్దని పలువురు న్యాయవాదులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ట్రెజరర్ ధన్‌పాల్ రమేష్, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులివ్వండి



మురుగుమయమైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలను గుర్తించి జంగిల్ క్లియరెన్స్ కోసం ఆయా స్థలాల యజమానులకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. 33వ డివిజన్ నేతాజీనగర్, వెంగళరావునగర్ తదితర ప్రాంతాల్లో గురువారం పర్యటించిన ఆయన మాట్లాడారు. ఈ విషయమై చెత్త సేకరణ వాహనాల ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న స్థానిక వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శికి షోకాజ్ నోటీసును జారీ చేయాలని ఆదేశించారు. డివిజన్లో భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలని కోరారు. సూర్యఘర్ బిజిలీ యోజనను ప్రభుత్వోద్యోగులు ఏర్పాటు చేసుకునేలా సర్క్యులర్‌ను పంపాలని సూచించారు. ఎనర్జీ సెక్రటరీ రోజూ ఉదయం తనిఖీలకు రావడం లేదని, షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని చెప్పారు. అనంతరం వెంగళరావునగర్‌లోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఎస్ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ చైతన్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించాలి



పరిశీలిస్తున్న జడ్జి వాణి

నెల్లూరు(అర్బన్): పుట్టుకతో లోపాలున్న పిల్లలకు నాణ్యమైన వైద్యసేవలందించి వారిని తిరిగి సాధారణ స్థితికి తీసుకొచ్చేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి సూచించారు. పెద్దాస్పత్రి ఆవరణలోని బాలభవిత కేంద్రంలో లోపాలున్న పిల్లలకు అందుతున్న వైద్యసేవలను గురువారం ఆమె పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. బాలభవిత కేంద్రాల ద్వారా వీరికి మంచి సేవలను అందిస్తున్నారని చెప్పారు. పట్టణాలతో పాటు పల్లెల్లో లోపాలున్న బిడ్డలకు ఈ సేవలు మరింత నాణ్యతగా అందేలా ఒక కమిటీని హైకోర్టు సూచనలతో ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కమిటీలో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, తాము ఉంటామన్నారు. ఇందులో భాగంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని సూచనల మేరకు తాము పరిశీలించామని వివరించారు. ప్రభుత్వ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్దానాయక్, ఏఓ కళారాణి, బాలభవిత కేంద్ర చిన్నపిల్లల డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ సుప్రియ, కేంద్ర మేనేజర్ జమీర్, యశ్వంత్, హెచ్‌డీఎస్ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు, సభ్యుడు మొగరాల సురేష్ పాల్గొన్నారు.

షెడ్యూల్ మేరకు టీకాలివ్వాలి



మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు(అర్బన్): పుట్టిన ప్రతి బిడ్డకూ షెడ్యూల్ ప్రకారం నిర్ణీత కాలంలో నూరు శాతం టీకాలేయాలని డీఎంహెచ్ఓ సుజాత సూచించారు. టీకాల కార్యక్రమంపై నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీ డాక్టర్లు, సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, రెండేళ్లలోపు పిల్లలు, ఐదేళ్లలోని వారిని గుర్తించి ప్రణాళిక ప్రకారం టీకాలేయాలని సూచించారు. దీనికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను మార్చి పదిలోపు సిద్ధం చేయాలన్నారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ, మాస్టర్ ట్రెయినర్ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోనికా స్టెఫీ, అర్బన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యాన్యువల్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

నెల్లూరు(టౌన్): మినీబైపాస్‌లోని అనిల్ గార్డెన్స్‌లో కృష్ణచైతన్య జూనియర్ కళాశాలల యాన్యువల్ డే వేడుకలను గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు, సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ కృష్ణారెడ్డి, డీన్లు రామాంజనేయులురెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి, రమేష్, ఏఓ హరి, చిరంజీవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ గంగాధరానికి సత్కారం



నెల్లూరు(అర్బన్): విజయవాడలోని కృష్ణా నది క్రాసింగ్‌లో ఆక్వా డెవిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో నెల్లూరు ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ గంగాధరం పాల్గొని సత్తా చాటారు. 62 ఏళ్లకు చేరువలో ఉన్న ఆయన 42.6 సెకన్లలో ఈది ప్రశంస పత్రం, జ్ఞాపికను అందుకున్నారు. ఈ క్రమంలో మూలాపేటలోని ధన్వంతరి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ఆయన్ను పలువురు ఆయుష్ డాక్టర్లు, సిబ్బంది గురువారం సత్కరించారు. జిల్లా ఆయుష్ అధికారి గోవిందయ్య, డాక్టర్లు సుధారాణి, శేఖర్, చంద్రశేఖర్, హేమంత్‌బాబు, సరళ హెప్సిబా, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: సౌత్‌మోపూరులో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం చేపట్టారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, టీడీపీ రూరల్ మండల కన్వీనర్ పముజుల ప్రదీప్, సర్పంచ్ తిరువీధుల పోలయ్య, ఎంపీటీసీ రాపూరు చెంచమ్మ తదితరుల పాల్గొన్నారు.